క్లుప్తంగా

పండగలు శాంతియుతంగా జరుపుకోవాలి

మెదక్ మున్సిపాలిటీ: అన్నిమతాల ప్రజలు తమ తమ పండగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని మెదక్ డీఎస్పీ రాజేశ్ పిలుపునిచ్చారు. శుక్రవారం రాత్రి మెదక్ పట్టణంలోని జీకేఆర్ గార్డెన్స్‌లో మోహర్రం, బోనాలు, వినాయక చవితి పండగల నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ నాగరాజు, పట్టణ ఎస్‌ఐ పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరి

కౌడిపల్లి(నర్సాపూర్): పశువుల్లో లంపిస్కిన్ నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువైద్యాధికారి రాజు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కుషన్‌గడ్డ తండాలో తెల్లజాతి పశువులకు లంపిస్కిన్ వ్యాధి నివారణకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతానికి మండలంలోని ఏగ్రామంలో కూడా లంపిస్కిన్ వ్యాధి లక్షణాలు కనబడలేదన్నారు. పశువుల్లో ఏవైనా వ్యాధి లక్షణాలు కనబడితే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ముందస్తు జాగ్రత్తగా లంపిస్కిన్ నిరోధక టీకాలు వేయించడం మంచిదన్నారు. కార్యక్రమంలో జీవీఓ కృష్ణకుమార్, వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య, సిబ్బంది సుజాత, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నేరం

మిషన్ శక్తి కోఆర్డినేటర్ సంతోషి



సమావేశంలో డాక్టర్లు, మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు

రామాయంపేట(మెదక్): మండలంలోని ప్రగతి ధర్మారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమంపై మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మిషన్ శక్తి కోఆర్డినేటర్ సంతోషి మాట్లాడుతూ.. భ్రూణ హత్యలు నేరమన్నారు. క్షీణిస్తున్న లింగ నిష్పత్తిని అరికట్టడానికి చట్టాలు కఠినతరంగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ హరిప్రియ మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరిత్యా నేరమని, చిన్నారులకు పెళ్లి చేస్తే కఠిన శిక్షలకు గురవుతారని పేర్కొన్నారు. మిషన్ శక్తి జెండర్ స్పెషలిస్ట్ నాగమణి సైబర్ క్రైమ్, సఖి సర్వీసేస్, పోక్సో చట్టం, చైల్డ్‌లైన్ సర్వీసెస్ గురించి వివరించారు. భరోసా టీం సపోర్ట్ పర్సన్ మంజుల, లావణ్య, ఎన్జీవో కోఆర్డీనేటర్ దయాశీల పాల్గొన్నారు.

మంజీరా విద్యాలయంలో గ్రీనరీ డే



పాఠశాలలో విద్యార్థులు

రామాయంపేట(మెదక్): పట్టణంలోని మంజీరా విద్యాలయంలో శుక్రవారం గ్రీనరీ డే నిర్వహించారు. ఉపాధ్యాయురాలు వాసవీ మొక్కల వల్ల కలిగే ఉపయోగాలను విద్యార్థులకు వివరించారు. మానవ మనుగడకు చెట్లే ప్రాణాధారమని, ప్రతీ ఒక్కరూ విధిగా మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని ఆమె సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ జితేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సురేశ్, ఉపాధ్యాయులు సుధాకర్, జయప్రకాశ్, మౌనిక, మీనా, లక్ష్మీప్రసన్న, భావన, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రొజెక్టర్, సౌండ్ సిస్టమ్ అందజేత

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచారం ప్రాథమిక పాఠశాలలకు ప్రొజెక్టర్, జెడ్పీ హైస్కూల్‌కు సౌండ్ సిస్టం సమకూరాయి. గత ఏడాది ఎంపీటీసీ నిధులతో వీటిని పంపిణీ చేయాలని అప్పటి ఎంపీటీసీ జాలిగామ వెంకటేష్ గౌడ్ ప్రతిపాదనల మేరకు ఇవి మంజూరయ్యాయి. వాటిని శుక్రవారం ఆయా పాఠశాలల హెచ్‌ఎం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకట్‌గౌడ్, హెచ్‌ఎం ఉమారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాకాంబరీ దేవిగా మహంకాళి



శాకాంబరి అవతారంలో మహంకాళి

చేగుంట(తూప్రాన్): వారాహి దేవి పూజల్లో భాగంగా చేగుంట మహంకాళి దేవాలయంలో అమ్మవారికి శాకాంబరిదేవిగా అలంకరించారు. శుక్రవారం మహంకాళి అమ్మవారిని కూరగాయలతో అలంకరించి, ప్రత్యేక పూజలను నిర్వహించారు.

ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు



కౌడిపల్లి(నర్సాపూర్): వెల్మకన్నెలో మొక్క నాటుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్



చిలప్‌చెడ్(నర్సాపూర్): చండూర్‌లో మొక్క నాటుతున్న ఎస్‌ఓ

చిలప్‌చెడ్(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా ఆయా గ్రామంలో ప్రతీ ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేసి, వాటిని నాటి, సంరక్షించాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీరోజు గ్రామాలను పర్యవేక్షిస్తూ, మౌలిక వసతులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ శ్యామ్, ఎంపీఓ శరత్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని జయప్రదం చేయాలి

చిలప్‌చెడ్ మండలంలో వనమహోత్సవ లక్ష్యాన్ని సమష్టి కృషితో జయప్రదం చేయాలని మండల ప్రత్యేధికారి మాన్యనాయక్ అన్నారు. శుక్రవారం ఆయన అధికారులతో కలసి మండల పరిధిలోని చండూర్ గ్రామంలో వనమహోత్సవాన్ని పరిశీలించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో నిర్దేశించుకున్న 80 వేల మొక్కల లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. ప్రతీ పౌరుడు నాటిన ప్రతి మొక్కను బాధ్యతగా సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఆనంద్, ఎంపీఓ శరత్‌కుమార్, ఏపీఓ శ్యామ్, ఈసీ భగవాన్‌రెడ్డి, కార్యదర్శి జితేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యం, పాల్గొన్నారు.

ప్రతీ మొక్కను సంరక్షించాలి

కౌడిపల్లి(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని వెల్మకన్నె గ్రామంలోని రాయగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో పలువురితో కలిసి వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయనతో కలసిన అధికారులు మండలంలోని గ్రామాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పుణ్యరాజ్, మాజీ సర్పంచ్ ఖాజీపేట రాజేందర్, మాజీ వైస్ ఎంపీపీ నవీన్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.



కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆనంద్

సమయపాలన పాటించకపోతే చర్యలు



మాట్లాడుతున్న ఎంఈఓ నీలకంఠం

రామాయంపేట(మెదక్): ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోతే చర్యలు తీసుకుంటామని మండల విద్యాధికారి నీలకంఠం హెచ్చరించారు. శుక్రవారం ఎంఈవో కార్యాలయంలో రామాయంపేట, నిజాంపేట మండలాల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ హెచ్‌ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అమ్మ ఆదర్శ పనులను నిత్యం పర్యవేక్షించి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని సూచించారు. విద్యార్థుల హాజరును ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేయాలని చెప్పారు. విద్యార్థులకు డిజిటల్ బోర్డుల ద్వారానే విద్యాబోధన చేయాలని తెలపారు. ఈ సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు రమ, జయ నిర్మల, రాజయ్య, రవీందర్, మహేందర్, నోడల్ అధికారులు శ్రీనివాస్, యాదగిరి, సీఆర్పీలు సంతోష్, శంకర్ పాల్గొన్నారు.

నీటి నిల్వ లేకుండా చూసుకోవాలి



ఫైజాబాద్‌లో నిల్వ ఉన్న నీటిని పారబోయిస్తున్న కార్యదర్శి నాగరాజు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ప్రతీ పౌరుడు తమ ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఎంపీడీఓ ఆనంద్ అన్నారు. శుక్రవారం చిలప్‌చెడ్ మండల గ్రామాల్లో డ్రై డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆనంద్ మాట్లాడుతూ.. వర్షకాలం సీజన్‌లో ఇంట్లో ఉన్న డ్రమ్ములు, టైర్లు, పాడేసిన కొబ్బరిబొండాలు, ఖాళీ సీసాలు, పాడైన కూలర్లల్లో నీటి నిల్వ అయ్యేందుకు అవకాశం ఉంటుందని, ఆ నీటిని ఎప్పటికప్పుడు పారబోయాలన్నారు. తద్వారా దోమలు, సీజనల్ వ్యాధుల భారీన పడకుండా ఉంటారన్నారు. అదేవిధంగా మురికి కాల్వల్లో బ్లీచింగ్, మురికి గుంటల్లో ఆయిల్‌బాల్స్ వేయించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శరత్‌కుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించాలి

● ఎంఈఓ బుచ్చనాయక్



మాట్లాడుతున్న ఎంఈఓ బుచ్చనాయక్

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో చదువు మధ్యలో మానేసిన డ్రాపౌట్ విద్యార్థులను గుర్తించాలని ఎంఈఓ బుచ్చనాయక్ సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేట ఎమ్మార్సీలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో పాటు సీఆర్‌పీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకటవ తరగతి నుంచి మొదలు డిగ్రీ వరకు చదువు మధ్యలో మానేసిన వారిని గుర్తించి నివేదిక అందించాలని సూచించారు. పాఠశాలలో ఉపాధ్యాయులులేని చోటుకు ఇతర ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేసి ఎలాంటి ఆటంకంలేకుండా బోధన కొనసాగించాలని కోరారు. పదవ తరగతి విద్యార్థులకు పుస్తకాల కొరతలేకుండా చూడాలని తెలిపారు. ఉపాధ్యాయులు సమయానికి వచ్చేలా చర్యలు చేపట్టాలని, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తరుచు తనిఖీలు చేపట్టాలని కోరారు.

రోడ్డును ఆనుకోని విద్యుత్ స్తంభాలు

అడ్డుచెప్పినా.. ఆగని పనులు



ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రం నుంచి సూరారం గ్రామానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిని ఆనుకొని విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌ను ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సూరారం గ్రామ శివారులో ఆర్‌అండ్‌బీ రోడ్డు పక్కన ఫీడ్ కంపెనీ ఏర్పాటు చేస్తున్నారని, దానికోసం విద్యుత్ లైన్ వేస్తున్న అధికారులు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని వేస్తున్న విద్యుత్ స్తంభాలను వేయొద్దని చెప్పినా వినడంలేదని గ్రామస్తుల వాపోతున్నారు. ఇదే విషయంపై ట్రాన్స్‌కో అధికారులకు చెప్పినా.. పట్టించుకోవంలేదని గ్రామ బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా వీరయ్య



నర్సాపూర్: చైర్మన్ వీరయ్యను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నర్సాపూర్: రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న పోదెం వీరయ్యను నర్సాపూర్‌కు చెందిన కాంగ్రెస్ నాయకుడు చింతల కరుణాకర్‌రెడ్డి శనివారం సన్మానించారు. ఆయన వెంట పలువురు పార్టీ నాయకులు ఉన్నారు. ఇదిలాఉండగా టీజీఐఐసీ చైర్‌పర్సన్ గా బాధ్యతలు స్వీకరించిన నిర్మలను డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రీస్కూల్ విధానం బాగుంది

● నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి



చండూర్ అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో టీచర్, చిన్నారులతో సీడీపీఓ హేమభార్గవి

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని చండూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ విధానం మెరుగ్గా ఉందని నర్సాపూర్ సీడీపీఓ హేమభార్గవి అన్నారు. శుక్రవారం ఆమె చండూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు, పిల్లల ఎత్తు, బరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్రంలోని చిన్నారులు వయసుకు తగిన ఎత్తు, బరువు ఉన్నారో, లేదో ప్రతీవారం పరిశీలించాలన్నారు. బలహీనంగా ఉన్న చిన్నారులకు సరైన పౌష్టికాహారం అందజేయాలన్నారు. ప్రీస్కూల్ విధానంతోనే చిన్నారులను బడికి అలవాటు అయ్యేలా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శశికళ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఉపాధ్యాయులకు సన్మానం



చేగుంట(తూప్రాన్): చెట్లతిమ్మాయిపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు



చిన్నశంకరంపేట(మెదక్): ఉపాధ్యాయులకు సన్మానం



శివ్వంపేట(నర్సాపూర్): ఉసిరికపల్లి ప్రాథమిక పాఠశాలలో..

చిన్నశంకరంపేట(మెదక్):మండలంలోని సూరారం ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్తున్న ఐదుగురు ఉపాధ్యాయులను గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శివప్రసాద్, ఉపాధ్యాయులు రవి, మహేశ్, శ్రీనివాస్, బాలమణిలను గ్రామ కార్యదర్శి నాంపల్లి, కాంప్లెక్స్ హెచ్‌ఎం సాయిరెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఉసిరికపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సుధాకర్ బదిలీపై వెళ్తుండడంతో శుక్రవారం గ్రామస్తులు హెచ్‌ఎంని సన్మానించారు. బీఆర్‌ఎస్ నాయకులు కృష్ణారావు, ఆంజనేయులు, వీరేష్, శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలలోని భుజిరంపేట ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులతో పాటు ఇక్కడికి బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులను హెచ్‌ఎం శంకర్ నాయకులు సన్మానించారు.

ఒకే పాఠశాలలో 14 ఏళ్లు..

చిన్నశంకరంపేట(మెదక్): ఒకే పాఠశాలలో 14 ఏళ్లు పనిచేయడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని నార్సింగి మండలంలోని శేరిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం శేరిపల్లి ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయుడిని , ఉపాధ్యాయురాలు జయంతిని సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం తిరుపతి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సురేష్ పాల్గొన్నారు.

చేగుంట(తూప్రాన్): మండలంలోని చెట్లతిమ్మాయిపల్లి అనంతసాగర్ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. చెట్లతిమ్మాయిపల్లిలో పదోన్నతిపై వెళ్తున్న హరిరంజన్‌శర్మ, సుధాకర్, అక్బర్‌పాష, కవిత, రేణుకలను సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతసాగర్ పాఠశాలలో నవిత, జోత్స్న, జ్యోతిర్మయిలను సన్మానించారు.

సాగుచేసే రైతులకే ‘భరోసా’



పిల్లుట్లలో మాట్లాడుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): భూమిని సాగుచేసి పంటలు పండించే రైతులకు ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వాలని మండలంలోని పిల్లుట్ల రైతులు అన్నారు. శుక్రవారం గ్రామ చావడి వద్ద మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డితో పాటు రైతులు రాఘవరెడ్డి, దామోదర్‌రెడ్డి, శివకుమార్ మాట్లాడుతూ.. రైతు భరోసాకు పరిమితి పెడితే సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉందన్నారు. సాగుచేసే వారందరికీ ఇవ్వడం వల్ల రైతులకు లబ్ధి చేకూరడంతో పాటు పంట ఉత్పత్తి పెరుగుతుందన్నారు. అన్ని పంటలకు బోనస్ ఇస్తే లాభదాయకంగా ఉంటుందన్నారు. ఖరీఫ్, రబీ సీజన్ పంటలు సాగుచేసే ముందస్తు తరుణంలోనే రైతు భరోసా రైతులకు ఇస్తే పంట పెట్టుబడికి ఉపయోగపడుతుందన్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు, గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ నెల 16న జరిగే సబ్‌కమిటీలో చర్చించి, రైతులకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పోచగౌడ్, సురేష్, ఆంజనేయులుగౌడ్, లక్ష్మయ్య, గణేశ్, దీనేష్‌రెడ్డి, అంజయ్య, తదితరులు ఉన్నారు.

పార్థీవ లింగాలకు ప్రత్యేక పూజలు



నిజాంపేటలో పార్థీవ లింగాలను తయారు చేసిన మహిళలు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రంలో హనుమాన్ దేవాలయంలో మహిళలు కాశీకి పంపించనున్న పుట్ట మన్ను పార్థీవ లింగాలకు పూజలు చేశారు. శుక్రవారం భూంపల్లి జయరాములు కాశీ నుంచి పుట్ట మన్నును తీసుకొచ్చి వాటితో పార్థీవ లింగాలను వారం రోజులుగా తయారు చేశారు. మహిళలు కాశీకి పంపించడానికి ప్రత్యేక పూజలు చేసి 6500 విగ్రహాలు చేశారు. కార్యక్రమంలో లహరి, వినోద, సౌజన్య, కవిత, అరుణ శ్రీ, స్వరూప, శోభ, మంగమ్మ ఇతర మహిళలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు**



కొల్చారం(నర్సాపూర్): మండలం వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. శుక్రవారం వరిగుంతం గ్రామంలో నిర్వహించిన డ్రైడే కార్యక్రమాన్ని ఎంపీడీఓ లక్ష్మీనర్సింలు పర్యవేక్షించారు. ఆరు బయట మూతలు లేకుండా నీటిని నిల్వ చేయడం ద్వారా దోమలు వృద్ధి చెంది డెంగీ, మలేరియా కారక దోమలు పెరిగేందుకు దోహదపడతాయని ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి గుంతల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు.

◆ **గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోండి**

వెల్దుర్తి(తూప్రాన్): గృహజ్యోతికి దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ ఏఈ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలనలో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకొని జీరో బిల్లులు రానివారు, విద్యుత్ కనెక్షన్ నంబర్ తప్పుగా నమోదు చేసినవారు ఎంపీడీఓ కార్యాలయంలో మరోమారు దరఖాస్తు సమర్పించాలని అన్నారు. గృహజ్యోతి దరఖాస్తుల్లో లోపాల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినందున ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కరెంట్ బిల్లుతో పాటు ప్రజాపాలన దరఖాస్తు రశీదు వెంట తీసుకెళ్లి సవరించుకోవాలన్నారు.

◆ **నల్ల పోచమ్మకు ఆషాఢ పూజలు**



మెదక్ మున్సిపాలిటీ: ఆషాఢ మాసం పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆటోనగర్‌లోని నల్ల పోచమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే గోల్కొండ వీధిలోని ముత్యాలమ్మ అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **గోశాలకు పశుగ్రాసం అందజేత**

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి వేణుగోపాలస్వామి ఆలయ వద్దనున్న గోశాలకు దాత శుక్రవారం ఎండు పశుగ్రాసం అందజేశాడు. ఉసిరికపల్లి గ్రామానికి చెందిన వేణుకుమార్‌గుప్తా 100 మోపుల ఎండు గ్రాసం గోశాల నిర్వాహకులకు అందజేశారు. గోశాలలో పశుగ్రాసం కొరత ఉందని దాతలు ముందుకు వచ్చి తమ సాయం అందజేయాలని గోశాల నిర్వాహకులు కోరారు.

◆ **బాల్య స్నేహితుడికి సాయం**

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న బాల్య స్నేహితుడికి తోటి స్నేహితులు శుక్రవారం ఆర్థికసాయం చేశారు. మండలంలోని గోమారం గ్రామానికి చెందిన తలారి శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మోకాలి ఆపరేషన్ చేసుకొని ఇబ్బందులు పడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న బాల్య స్నేహితులు రూ.15 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. అనిల్, శ్రీరాములు, వెంకట్‌రెడ్డి, ముత్యాలు ఉన్నారు.

◆ **ప్రిన్సిపాల్ సెక్రటరీకి ఫిర్యాదు**

రామాయంపేట(మెదక్): పట్టణంలోని బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులను ఎలుకలు కరిచిన విషయమై శుక్రవారం మెదక్ మాజీ ఎమ్మెల్యే శశీధర్‌రెడ్డి, సాంఘీక సంక్షేమశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థుల సంక్షేమం విషయమై చర్యలు తీసుకోవాలని తాను సూచించగా, ప్రిన్సిపాల్ సెక్రటరీ సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.

◆ **రేషన్ బియ్యం పట్టివేత**

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని శివ్వంపేట పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. మండల పరిధిలోని ఎదుల్లాపూర్ చౌరస్తా వద్ద ఆటో ట్రాలీలో సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం తరలిస్తుండగా.. గుర్తించిన పోలీసులు పట్టుకొని ఆటోని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

◆ **శేరిపల్లిలో కేబుల్‌వైర్లు చోరీ**

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని శేరిపల్లి గ్రామశివారులోని రైతుల వ్యవసాయ బోరు బావుల కేబుల్‌వైర్లను గుర్తుతెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. గురువారం రాత్రి పంటపొలాల వద్ద బోరుమోటార్ నుంచి కేబుల్‌కట్ చేసి ఎత్తుకెళ్లినట్లు రైతులు తెలిపారు.

◆ **గోపురం శిలకు పూజలు**



పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని రామాలయ పునఃనిర్మాణ పనుల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. విమా న గోపురం శిలకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. దేవాలయ నిర్మాణానికి అందరి సహకారం కావాలన్నారు. ఇందులో ఆలయ కమిటీ అధ్యక్షుడు కనక రాజు, ఆలయ అర్చకుడు, గ్రామస్తులు పాల్గొన్నారు.